క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : నియోజకవర్గంలో బుధవారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్‌కే రోజా పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు నగరి బస్టాండు ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. అనంతరం పుత్తూరు మండలం తిరుమలకుప్పం సచివాలయ పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నిండ్ర మండలం ఆరూరు సచివాలయ పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు నగరిలోని క్యాంప్ కార్యాలయంలో ''ఎందుకు ఏపీకి జగన్ కావాలి'' నియోజకవర్గస్థాయి సమావేశంలో పాల్గొంటారు.

చక్రపాణిరెడ్డికి ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శ



చక్రపాణిరెడ్డి తల్లి లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నిండ్ర: శ్రీశైలం ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి తల్లి లక్ష్మమ్మ వారం రోజుల క్రితం మృతి చెందారు. ఈ సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మంగళవారం కొప్పేడు గ్రామానికి వెళ్లి చక్రపాణి రెడ్డిని పరామర్శించారు. అనంతరం లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు మనోహర్‌నాయుడు, మురళినాయుడు, తదితరులు ఉన్నారు.

సచివాలయ వ్యవస్థ చరిత్రాత్మకం

వెదురుకుప్పం: గాంధీ కలలను ప్రభుత్వం సాకారం చేస్తున్నట్లు పాతగుంట సర్పంచ్ భువనేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని పచ్చికాపల్లం, పాతగుంట, కొమరగుంట పంచాయతీలలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్‌లు ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన సచివాలయాల వ్యవస్థ చరిత్రాత్మకమన్నారు. సర్పంచ్ ద్రాక్షాయణి, డీడీఓలు కుమార్, శ్రీనివాసులు, కొమరగుంట సచివాలయ కన్వీనర్ జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయానికి సిమెంటు వితరణ



సిమెంటు బస్తాలు అందిస్తున్న ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు

నగరి : పట్టణ పరిధిలోని నేత్రదేవత దేశమ్మ ఆలయానికి ఎలక్ట్రికల్ అసోసియేషన్ వారు సిమెంటు బస్తాలను వితరణగా అందించారు. గంగజాతరకు విచ్చేసే భక్తులకు మజ్జిగ పంపిణీ నిమిత్తం అసోసియేషన్ సభ్యులు ఇచ్చిన విరాళాల్లో మిగిలిన మొత్తాన్ని గ్రామదేవతకు ఖర్చు చేయడానికి అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌సీ ఆనంద్‌కుమార్ మంగళవారం 12 సిమెంటు బస్తాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుబాబుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ రవి, కేపీ కుమార్, అరుణగిరి, దామోదరం, ప్రభు, ఆలయ అర్చకుడు నీలకంఠం, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

గోవింద భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

నగరి : నేత్రదేవత దేశమ్మ ఆలయంలో గోవింద భక్తులకు సంపత్ అనే దాత అన్నదానం చేశారు. తమిళనాడు నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులు దారిలో దేశమ్మ దేవతను దర్శించుకుని వెళ్తారు. ఇలా వచ్చే భక్తులు సుమారు 600 మందికి ఆలయం వద్ద అన్నదానం చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ప్రిన్సిపల్ స్వరూప

కార్వేటినగరం: కళాశాలలో నిర్వహించే స్టడీ అవర్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పీ.స్వరూప అన్నారు. మంగళవారం కళాశాలలో వృత్తి విద్యా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలకు హాజరు విషయంలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పాఠ్యాంశ బోధనను శ్రద్ధగా విని, చదవడం ద్వారా ఉన్నతమైన ఫలితాలను సాధించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ యూనిఫాంతో కళాశాలకు హాజరు కావాలన్నారు. ఉన్నత ఫలితాల సాధన కోసం అధ్యాపకులకు 15 మంది విద్యార్థులను కేటాయించి విద్యా సంస్కరణలో నూతన విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కే.రమేష్, డాక్టర్ మాధవనాయుడు, కిషోర్‌కుమార్, డాక్టర్ కమలాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష.. జగనన్న సురక్ష

- జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి
- మంత్రి ఆర్‌కే రోజా



విజయపురం: వృద్ధులకు కళ్ల అద్దాలు అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం (నగరి) : ఇకపై మీ ఇంటి వద్దే ప్రభుత్వ వైద్య సిబ్బంది 7 రకాల ఆరోగ్య పరీక్షలు చేసి, వైద్యం అందిస్తారని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మంగళవారం పన్నూరు సబ్‌స్టేషన్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రికి రాని ఆలోచన సీఎం జగనన్నకు వచ్చిందన్నారు. ఆ ఆలోచనే పేదలకు మెరుగైన వైద్యం అందించాలని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అనునిత్యం ప్రజల కోసం ఆలోచించే వ్యక్తి జగనన్న మనకు సీఎంగా ఉండడం మన అదృష్టమన్నారు. రాష్ట్రప్రజలకు ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలు వారు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందించిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ , జెడ్పీటీసీ రేవతి, ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ వెంకట్రాయులు, డాక్టర్ సోమశేఖర్, చంద్ర, ప్రసాద్, మునిశరణ్య, విష్ణుప్రియ, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజగోపాల్, కోఆప్షన్ మెంబర్ రాజేంద్ర, నార్పరాజు, సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిండ్రలో..

నిండ్ర: ప్రతి పేదవాడు ఆరోగ్యంగా ఉండాలనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అగరం సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, దుర్గాదేవి, వైద్యాధికారి కళ్యాణి, సర్పంచ్ చెల్లమ్మ, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ అమరేంద్రబాబు, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, మండల కన్వీనర్ వేణురాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో..

కార్వేటినగరం: పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అన్నూరు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని సర్పంచ్ సుందర్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 549 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, డిల్లీ, డాక్టర్లు గోపినాథ్, మురళీకృష్ణ, హేమశ్రీ, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

జీడీనెల్లూరు మండలంలో..

గంగాధరనెల్లూరు: మండలంలోని అగర మంగళం గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ అనిత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, జెడ్పీటీసీ లక్ష్మీప్రియ, సర్పంచ్ సరోజమ్మ, వైద్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని ఎంపీపీ నాగరాణి అన్నారు. మంగళవారం మండలంలోని ఆళ్లమడుగు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకరరావు, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షురాలు భారతి, నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఓ వరమని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్, తహసీల్దార్ బాబు అన్నారు. మంగళవారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ పాఠశాలలో వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. కృష్ణజమ్మపురం గ్రామ సచివాలయ పరిధిలో ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి 412 మందికి టోకెన్లు ఇచ్చారు. శిబిరానికి విచ్చేసిన 352 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అగరంలో ఆరోగ్య సురక్ష కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు



గంగాధరనెల్లూరులో..



బీపీ పరీక్షించుకుంటున్న ఎంపీపీ నాగరాణి



పాలసముద్రంలో..

చల్లగా చూడు గంగమ్మ తల్లీ..



గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : అందరినీ చల్లగా చూడు గంగమ్మ తల్లీ అని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అమ్మవారిని వేడుకున్నారు. మండలంలోని జట్టివాని ఒడ్డు గ్రామంలో గంగమ్మ ఆలయంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకం వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే 2024 ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని వేడుకున్నట్లు తెలిపారు. జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ఈ సువర్ణ పాలన రాష్ట్రంలో ఇలాగే కొనసాగాలని అమ్మవారిని కోరుకున్నట్లు మంత్రి చెప్పారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకోగా, ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనలు పలికి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయకుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, నాయకులు మోహన్, మధురెడ్డి, యతీశ్వర్‌నాయుడు, రామకృష్ణారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, బూత్‌కమిటీ నియోజకవర్గం కన్వీనర్ నారాయణరెడ్డి, ఎస్సీసెల్ మండల కన్వీనర్ దాము పాల్గొన్నారు.

ముప్ఫై ఏళ్ల తరువాత కలిసిన వేళ..



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పుత్తూరు రూరల్: ఆనాటి ఆ స్నేహం.. ఆనంద గీతం అంటూ ముప్ఫై ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు అంతా మళ్లీ అదే పాఠశాలలో కలిసి సందడి చేశారు. స్థానిక గేట్‌పుత్తూరులోని జిల్లా పరిషత్ తమిళ పాఠశాల పరిసరాలు పూర్వ విద్యార్థుల సందడితో కళకళలాడాయి. 1993–94 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకుంటూ, ఒకరినొకరు పలకరించుకున్నారు. ప్రస్తుతం ఎవరు ఎక్కడ ఎలా స్థిరపడ్డారనే విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ హెచ్‌ఎం భక్తశీలన్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. ముప్ఫై ఏళ్ల తరువాత విద్యార్థులు తమని ఆహ్వానించి, సత్కరించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఇదే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మార్టిన్, కృష్ణవేణి, రుకుమణి, శాంతకుమారి, నారాయణస్వామి, ఈస్టర్, ముత్తువేల్, రామచంద్రన్, శ్రీనివాసన్, నటరాజన్‌ను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నియమ్మకు విశేష పూజలు



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజుకుప్పం కోనచెరువు సమీపంలో వెలసిన ఆకాశ కన్నియమ్మకు గ్రామస్తులు మంగళవారం విశేష పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి పాలు, పెరుగు, తేనె, నెయ్యి చందనంతో అమ్మవారిని వివిధ అభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం తమిళనాడు అమ్మవారికుప్పం గ్రామంలోని మహిళలు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెటి అమ్మవారికి సమర్పించారు. గ్రామస్తులు తెచ్చిన వివిధ సుగంధ పుష్పాలతో ఆలయ అర్చకులు అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారాధన చేశారు. భక్తులు అమ్మవారికి టెంకాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి మొక్కుకున్నారు.

వృద్ధులకు దుస్తుల వితరణ



చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు దిలీప్‌మొదలి

పుత్తూరు రూరల్: పట్టణంలోని అనాథ వృద్ధాశ్రమంలోని మహిళలకు మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి చీరలు, ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. అలాగే గేట్ పుత్తూరులోని ఎస్సీ హాస్టల్లోని 150 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, కూల్ డ్రింక్స్ అందజేశారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ తన తండ్రి సీఎస్.బాబు వర్ధంతి సందర్భంగా వృద్ధులకు, పేద విద్యార్థులకు సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుట్టీ, చిరంజీవి, శివ, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బీజేపీ కార్యవర్గంలోకి 'చిలకం'



చిలకం ఈశ్వరప్రసాద్ రెడ్డి

పుత్తూరు రూరల్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నగరి నియోజకవర్గానికి చెందిన చిలకం ఈశ్వర ప్రసాద్‌కు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. విజయపురం మండలం మంగళం గ్రామానికి చెందిన ఈశ్వరప్రసాద్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చిలకం రామచంద్రారెడ్డి కుమారుడు. ఈయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర పార్టీలోకి తీసుకున్నట్లు సమాచారం. ఈయన నియామకం పట్ల జిల్లా పార్టీ కార్యదర్శి కె.బాబు, కార్యవర్గ సభ్యుడు కె.ఎన్.హరిబాబు, జిల్లా టీచర్స్ సెల్ కన్వీనర్ ఎం.సుబ్రమణ్యం, స్థానిక నాయకులు వెంకటేష్, శేఖర్, హరి, చక్రపాణి, రామ్మూర్తిరాజు, సుబ్రమణ్యం హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధిహామీ పనులపై సమీక్ష

పాలసముద్రం : జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న పనులను ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు ఎదగాలని సర్పంచ్ అయ్యప్ప, ఎంపీటీసీ గోవిందరాజు తెలిపారు. మంగళవారం పాలసముద్రం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ధరణి ఆధ్వర్యంలో లేబర్ బడ్జెట్‌పై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ అయ్యప్ప మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి వంద రోజులు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. ఐదు ఎకరాల లోపు పొలం ఉన్న రైతులకు మునగ, పండ్లతోటల పెంపకం చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో అవసరమైన చోట మొక్కలు పెంచుకోవచ్చని తెలిపారు. కూలీలు పనులు చేసి అందులో వచ్చిన నగదుతో ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మునిరత్నం, ఫీల్డ్‌అసిస్టెంట్ గోవిందరాజు, వీఆర్‌ఓ, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్ శివ, ఉపాధిహామీ కూలీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి



జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రం వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న రోగులు

శ్రీరంగరాజపురం : ప్రజల చెంతకే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వ వైద్యం అందించి రోగుల కళ్లల్లో ప్రభుత్వం ఆనందం నింపుతోందని జిల్లా టీకాల అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మండలంలోని కటికపల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యను గుర్తించి ఒక్క రూపాయి కూడా భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడం కోసం ప్రవేశపెట్టిందే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అన్నారు. వైద్యులు పూర్తి స్థాయిలో పరీక్షించి మందులను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అనంతరం సర్పంచ్ గిరిబాబు మాట్లాడుతూ జగనన్న పేదప్రజలు అభివృద్ధి, ఆరోగ్యం కోసం ఎంత శ్రద్ధ వహిస్తున్నారో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమే నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మార్కొండయ్య, ఎంపీడీఓ కష్ణయ్య, తహసీల్దార్ లోకనాథపిళ్లై, మండల వైద్యాధికారులు డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, పల్లవి, నాయకులు సురేష్, జనార్ధన్, మణి, మునస్వామి, అమాసయ్య, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'మీకు ఐదురోజులే గడువు'



పందుల పెంపకందారులతో మాట్లాడుతున్న చైర్మన్ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి

నగరి : పట్టణ ప్రాంతంలో పందుల బెడద ఉండదని 16వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు మంత్రి ఆర్‌కే రోజా దృష్టికి తీసుకురావడం, కౌన్సిలర్లు ఈ సమస్యను సమావేశంలో ప్రశ్నించడంతో పందుల పెంపకం దారులకు పలు హెచ్చరికలు జారీ చేస్తూ వస్తున్నారు. చివరిగా వారికి ఐదురోజులు చివరి గడువు ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలియజేశారు. మంగళవారం పందుల పెంపకందారులతో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సంచరించని ప్రాంతాల్లో పందులు మేపుకోవాలని ఎన్నిసార్లు హెచ్చరికలు జారీచేసినా వారిలో మార్పు రావడం లేదన్నారు. పట్టణ పరిధిలో రోడ్లపై, వీధులపై, రద్దీగా ఉన్న ప్రాంతాల్లో పందులు సంచరిస్తూనే ఉన్నాయన్నారు. ఇది ప్రజలు అనారోగ్యం బారి పడేందుకు, వ్యాధుల వ్యాప్తికి దోహదపడుతుందన్నారు. చివరిగా ఐదురోజులు గడువు మాత్రమే ఇస్తున్నామని ఆపై పట్టణంలో ఎక్కడ పందులు సంచరించినా వాటిని పట్టి దూరపు ప్రాంతంలో వదిలివేయడం జరుగుతుందన్నారు. ఆర్థిక నష్టానికి పురపాలకసంఘం బాధ్యత వహించదన్నారు. ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామి ఆలయంలో కృత్తిక వేడుకలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణీ సమీపంలో కుమారగిరిపై వెలసి ఉన్న వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో కృత్తిక వేడుకలను పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం వళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు పలువురు పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలు సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్, జంతు శాస్త్ర విభాగం సంయుక్త సహకారంతో విద్యార్థుల రక్త నమూనాలు సేకరించారు. సుమారు 40 మంది విద్యార్థులకు సంబంధించి రక్తం సేకరించి వారి గ్రూపులను నిర్ధారించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ రక్త గ్రూపులను విధిగా తెలుసుకోవాలన్నారు. రక్త మార్పిడి సమయంలో రక్త గ్రూపులు తెలియకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. దీని కోసం రక్తం గ్రూపులు తెలుసుకుంటే భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రక్తంలో ఉండే యాంటీజన్లు, రక్త గ్రూపులు ఎలా వస్తాయి ? రక్త గ్రూపుల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభ



మాట్లాడుతున్న సర్పంచ్ ధనంజయవర్మ

కార్వేటినగరం: సమస్యల పరిష్కారం కోసమే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయవర్మ అన్నారు. మంగళవారం సచివాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించుకోవడానికి గ్రామసభలు ఎంతో దోహద పడతాయని తెలిపారు. వార్డు మెంబర్లు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను గుర్తించి సమావేశం దృష్టికి తీసుకొచ్చినప్పుడే ఆ సమస్యకు పరిష్కార మార్గం లభిస్తోందని చెప్పారు. అనంతరం సమస్యలపై పలువురు అందించిన వినతులను స్వీకరించి పరిష్కారానికి ఆమోదం తెలిపారు. అలాగే పంచాయతీలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై పంచాయతీ తీర్మానాన్ని ఆమోదించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషాద్రి, ఎంపీటీసీ వెంకటేష్, పంచాయతీ పీఎస్ మణి, కార్యదర్శి శెల్వి, విజయశ్రీ వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.


పంటల సాగులో మెలకువలు పాటించాలి



వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఏఓ డిల్లీప్రసాద్

పాలసముద్రం : మండల పరిధిలోని రైతన్నలు వరి, వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలని ఏఓ డిల్లీప్రసాద్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం పంచాయతీ చెరువుముందర కండ్రిగ గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ఏఓ డిల్లీప్రసాద్ మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటకు సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలని, దాని ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా తీసుకున్న జింక్ సల్ఫేట్ బోరాన్ జిప్సం ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. నేల బాగుంటేనే పంట అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. వేరుశనగ కోత, నిల్వలో జాగ్రత్తలు, కత్తెర పురుగు యాజమాన్యాలపై చర్యల గురించి వివరించారు. చెరుకులో బిందుసేద్యం పద్ధతిలో పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. వరిపంటలో డ్రమ్ సీడర్ పద్ధతిలో పంటసాగు చేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని కూలీల అవసరం కూడా తక్కువ ఉంటుందన్నారు. వరిలో ఆకుముడుత, కాండము తొలుచు పురుగు నివారణ చర్యలు, చెరుకులో ఎరువులు వాడేటప్పుడు తీసుకోవాలని జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. రైతులు సాగు చేసిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ పాల్గొన్నారు.

పరికరాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ హేమచంద్రారెడ్డి

పుత్తూరు రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్షా అభియాన్ కోఆర్డినేటర్ హేమచంద్రారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపకరణాల అసెస్మెంట్ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉపకరణాలు వినియోగించాలని సూచించారు. నగరి నియోజకవర్గంలో డాక్టర్లు అసెస్ చేసిన 106 మంది పిల్లలను గుర్తించి, వారికి అవసరమైన వీల్‌ఛైర్స్, హియరింగ్ ఎయిడ్స్, ట్రైసైకిల్స్, ఎంఆర్ కిట్స్, రోలేటర్స్ వంటి ఉపకరణాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, పాఠశాల హెచ్‌ఎం భువనేశ్వరి, స్పెషల్ టీచర్స్, నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.